# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 169 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

07-05-2026 గురువారం వెల : 1/- పేజీలు : 4


## యువత చదువుతోపాటు క్రీడలు పైన దృష్టి పెట్టాలి...

### ఎమ్మెల్యే కూన రవికుమార్

**నవతరం -ఆమదాలవలస**

ఆమదాలవలస పట్టణంలోని జూనియర్ కాలేజీ మైదానంలో ఎమ్మెల్యే కప్ టీ20 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించిన ఆముదాలవలస నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారు.

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెరగడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే గారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కూన రవికుమార్ గారు క్రీడాకారులతో పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బ్యాటింగ్ చేసి, తొలి బంతిని ఆడి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి పాల్గొన్న జట్లకు స్వాగతం పలుకుతూ క్రీడలను ఆరోగ్యకరమైన పోటీ వేదికగా భావించాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే గారు, ప్రభుత్వం కూడా క్రీడా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడం



కోసం ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతా విద్యాసాగర్ గారు, జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్ గారు, టిడిపి ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత గారు,స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛ నరసన్నపేటే ధ్యేయం

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పట్టణ పారిశుధ్య పనుల్లో భాగస్వాములైన 100 మందికి పైగా ఉన్నతాధికారులు
- వార్డుకో ఇన్చార్జ్ అధికారి.. ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన

2లో



## గూడేంలో బడిపిలుస్తుంది

- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి
- జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు

**నవతరం -శ్రీకాకుళం**

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు తెలిపారు. గూడేంలో నిర్వహించిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో ప్రవేశాలపై ప్రభుత్వం ముందస్తుగానే దృష్టి సారించిందని, ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలను (అయిదు సంవత్సరాలు పూర్తయిన వారు) ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించేందుకు పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. గడిచిన కొన్ని రోజులుగా క్షేత్రస్థాయిలో అధికారులు, ఉపాధ్యాయులు పర్యటిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, అందిస్తున్న పథకాలను వివరించి ప్రవేశాలను ప్రోత్సహిస్తున్నారు. గ్రామాల్లో ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారితో సమగ్ర శిక్షా అధికారి పి.



వేణుగోపాలరావుతో కలసి శ్రీకాకుళం మండలం గూడేం గ్రామంలో పర్యటించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆధునిక బోధన, అధునాతన సామగ్రి, అర్హత గల ఉపాధ్యాయులు, ప్రవేశాలు పొందే వారికి ప్రభుత్వం అందిస్తున్న విద్యార్థి మిత్ర (పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు, బ్యాగు, బెల్టు) పథకం ద్వారా ఉచితంగా కిట్ల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం (డొక్కా సీతమ్మ) ద్వారా పౌష్టికాహారం, తదితరాల గురించి తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. గూడేంలో నిర్వహించిన బడి పిలుస్తుంది కార్యక్రమంలో 22 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శార్వాణి, ఎపిసి పి. వేణుగోపాలరావు, డిప్యూటీ డిఈఓ విజయ కుమారి, పాఠశాల కమిటీ అధ్యక్షులు కె. యర్రయ్య, ఎంఈఓలు నత్తల కృష్ణ, పెంకి సుజాత, సిఎంఓ బి. శ్రీధర్, ఎఎంఓ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2026కు దరఖాస్తుల ఆహ్వానం..

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలో వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన బాలల నుంచి 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026' కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు మరియు సంస్కృతి విభాగాల్లో విశిష్ట గుర్తింపు పొందిన బాలలు ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. 5 ఏళ్లు పైబడి, 31 జూలై 2026 నాటికి 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలలు వ్యక్తిగతంగా లేదా ఏదైనా సంస్థ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని ఆయన వివరించారు.

అర్హత కలిగిన అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాలు, ప్రతిభకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు మరియు పత్రికా క్లిప్పింగ్‌లతో https://awards.gov.in అనే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేయడానికి జూలై 31, 2026 ఆఖరు తేదీ అని స్పష్టం చేశారు.

జిల్లాలోని ప్రతిభావంతులైన బాలలు ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

## ప్రతి వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



- టెక్కలి అభయం హెల్మెట్ బ్యాంక్ ర్యాలీ
- హెల్మెట్ వాడకములో నిర్లక్ష్యము వద్దు
- బాధ్యతతో హెల్మెట్ ప్రతి వాహనదారుడు ధరించాలి
- డిఎస్పి డి లక్ష్మణరావు....

**నవతరం టెక్కలి**

నేడు టెక్కలి జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు టెక్కలి పోలీస్ వారు మరియు అభయం హెల్మెట్ బ్యాంకు వారు ఆర్టీవో కృష్ణమూర్తి డిఎస్పి డి లక్ష్మణరావు వారి ఆధ్వర్యంలోర్యాలీ నీ స్థానిక డిగ్రీ కాలేజీ వద్ద ప్రారంభించి ఇందిరాగాంధీ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు తాత్కాలికంగా హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రమాదాల నివారణ చర్యలో భాగముగా జిల్లా పోలీస్ యంత్రాంగము రోడ్డు ప్రమాదాలను వారి నుండి 20 శాతం వరకు తగ్గించారని తెలిపారు తదుపరి డిఎస్పిటి లక్ష్మణరావు మాట్లాడుతూ అభయం హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు ఈ కార్యక్రమంలో టెక్కలి అర్బన్ పోలీస్ ఇన్స్పెక్టర్ రూరల్ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఎస్సైలు పోలీస్ సిబ్బంది ఆర్టీసీ ఉద్యోగస్తులు మరియు ప్రజలు పాల్గొన్నారు.






## ప్రజలకు, చట్టానికి పీఎల్‌వీలే వారధులు

2లో



ఎడిటోరియల్

# హెచ్చరికలు-సందేశాలు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పలు పార్శ్వాలను తడిమాయి. హెచ్చరికలు, సందేశాలూ ఇస్తున్నాయి. పశ్చిమబెంగాల్, అసోం, పుదుచ్చేరి.. మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారం చేజిక్కించుకోవడంతో దేశంలో మితవాద శక్తుల పెరుగుదలకు ఆస్కారం కలిగింది. ఇంకో వైపు పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాలలో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నికరంగా నిలబడి పోరాడుతున్న కేరళం, తమిళనాడు ప్రభుత్వాల ఓటమి ప్రజాస్వామ్య, ప్రగతిశీల ప్రజలకు ఆందోళన కలిగిస్తుంది. మరెక్కడా ఉనికిని పెంచుకోలేని కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు ఊతకర్రగా పని చేస్తుంది. అక్కడ బీజేపీని ఎదురొడ్డి సైద్ధాంతికంగా సవాల్ చేస్తున్న ఎల్‌డిఎఫ్‌పై కాంగ్రెస్ గెలవడం గమనార్హం. వామపక్షాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే కేరళంలో బీజేపీ తన ప్రభావం చూపలేక పోయింది. మూడు సీట్లకే ఆ కూటమి పరిమితమైంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఈ తడవ ఓడిపోవడం లౌకిక, ప్రజాతంత్ర పోరాటాలకు ఎదురుదెబ్బ. కేంద్రంలోని బీజేపీ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొని ప్రజల సంక్షేమం, హక్కుల కోసం ఎల్‌డిఎఫ్ సర్కార్ అవిరళ కృషి చేసింది. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచి రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టడంలో ముందు పీఠిన నిలబడింది. ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ గెలుపునకు బీజేపీ సహకరించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ మంచి ఓటింగ్‌ను, సీట్లను లెఫ్ట్ పొందగలిగింది. తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వార్తలొస్తు న్నాయి. ఎవరు టివికెకి మద్దతి స్తారో త్వరలోనే తెలిసిపోతుంది. తాము బీజేపీ సిద్ధాంతానికి వ్యతిరేకమని, ఇదే సమయంలో డిఎంకె తమకు రాజకీయ శత్రువని విజయ్ ఎన్నికల్లో ప్రకటించి ప్రచారం చేశారు. పలు ప్రజాకర్షక పథకాల హామీలూ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాటకు విజయ్ కట్టుబడి ఉండాలి. తమిళనాడులో డిఎంకె పరాజయం చెందగా, ఆ పార్టీ చీఫ్ ఎంకె స్టాలిన్ స్వయంగా ఓటమి పాలవడం, ఆయన ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తెలుపుతోంది. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బీజేపీ ఎంతగా గింజుకున్నా తమిళనాట ప్రాంతీయ ద్రవిడ పార్టీల ప్రాబల్యం ముందు నిలబడలేదని ఓటర్లు మరోసారి నిరూపితం చేశారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతిభద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి మెజార్టీ మతం ఓట్లను సమీకరించడంలో సక్సెస్ అయింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. అసోంలో ఇటువంటి మతోన్మాద కుయుక్తులతోనే అధికారాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్‌తో కలిపి అధికారాన్ని కాపాడుకుంది. తమిళనాడులో వామపక్షాలకు నాలుగు సీట్లు, బెంగాల్‌లో ఒక సీటు, గుర్తించదగిన ఓటింగ్‌ను సీపీఐ(ఎం), వామపక్షాలు దక్కించుకున్నాయి. ఎన్నికల కమిషన్ (ఈసి), సహా కేంద్ర సంస్థల దుర్వినియోగం, డబ్బు, కండబలం, మద్యం ప్రవాహంలో సీపీఐ(ఎం), వామపక్షాలు చూపించిన పెర్ఫార్మెన్స్ చెప్పుకోదగినది. ఈ ఎన్నికల్లో ఎస్.ఐ.ఆర్. అమలు ప్రతిపక్షాల ఓటమికి, బీజేపీ గెలుపునకు దోహదపడినట్లు తెలుస్తోంది. తాజా ఎన్నికల ఫలితాల దన్నుతో బీజేపీ, మితవాద శక్తులు మరింత విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. లౌకికవాద పరిరక్షణకు యావత్ దేశ ప్రజానీకం అప్రమత్తం కావాల్సిన సమయమిది.

# మేకప్ మాస్టర్ క్లాస్ పోస్టర్ విడుదల




**నవతరం -శ్రీకాకుళం**

**- శ్రీకాకుళం అతివలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**- డా. పైడి.సింధూర**

ప్రముఖ అంతర్జాతీయ మేకప్ ఆర్టిస్ట్ అనురాగ్ ఆర్య వర్ధన్ నేతృత్వంలో జూన్ 9వ తేదీన విశాఖలో సెమినార్ ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక సింధూర హాస్పిటల్ లో, డా. పైడి.సింధూర చేతుల మీదుగా పోస్టర్ ను విడుదల చేసి మాట్లాడుతూ విశాఖలో జరగనున్న ఈ వేదికలో, అనురాగ్ ఆర్య వర్ధన్ మెళుకువలను తెలియజేస్తారని, అవార్డు కార్యక్రమం కూడా ఇందులో ఒక భాగమని, శ్రీకాకుళం జిల్లాలో ఉండే, బ్యుటీషియన్స్ అతివలందరూ పాల్గొని, ఆర్యన్ అందిస్తున్న నాణ్యమైన, కచ్చితమైన సలహాలను పాటించి, సౌందర్య నిపుణులుగా ముందుకు సాగాలన్నారు. ఈ అవగాహన సదస్సు, అవార్డు వేడుకలలో పాల్గోవాలనుకుంటే, శ్రీకాకుళంలో ప్రముఖ సౌందర్య నిపుణురాలు, పారూస్ మేకప్ స్టూడియో అధినేత ప్రిస్కిల్ల గిరి రాజ్ ను సంప్రదించాలన్నారు. అనంతరం ప్రిస్కిల్ల గిరి రాజ్ మాట్లాడుతూ ఆశాశ్ హెర్బల్ కేర్, ఈ కార్యక్రమానికి ఆతిధ్యమిస్తుండగా, శ్రీకాకుళం జిల్లా పారూస్ మేకప్ స్టూడియో నుండి సహకారం అందిస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన మేకప్ ఆర్టిస్ట్ అనురాగ్ మేకప్ మంత్ర ద్వారా, ఇంటర్నేషనల్ మేకప్ మాస్టర్ క్లాస్‌లు, బ్రైడల్, ఎడిటోరియల్ కోర్సులను నిర్వహిస్తున్నారని, ఈ మాస్టర్ క్లాస్‌లలో లైవ్ డెమోలు, ప్రొడక్ట్ నాలెడ్జ్, అవార్డు ప్రధానోత్సవాలు ఉంటాయన్నారు. నిపుణుల శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మేకప్ టెక్నిక్స్, లుక్ అండ్ లెర్న్ సెమినార్‌లు ఉంటాయని, ప్రొడక్ట్ నాలెడ్జ్, చర్మ సంరక్షణ, క్లయింట్ మేనేజ్‌మెంట్ పద్ధతులపై అవగాహన కల్పిస్తారని, ఆసక్తిగల అతివలు ఈ కార్యక్రమంలో పాల్గొని, సెమినార్ ను విజయవంతం చేయాలన్నారు. పూర్తి వివరాలకు లేదా, కార్యక్రమ ఎంట్రీ పాసుల కొరకు పారూస్ మేకప్ స్టూడియోను చరవాణి (95732 94909) ద్వారా సంప్రదించాలన్నారు.
ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఆశాశ్ హెర్బల్ కేర్ ప్రతినిధులు జి.ఆశ, వంశి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ల పంపిణీ

**నవతరం -ఎచ్చెర్ల**



శ్రీకాకుళం జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, యూనియన్ బ్యాంకు ఆర్థిక సహకారంతో ఎచ్చెర్ల లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమదాలవలస శాసనసభ్యుడు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ హాజరై శిక్షణ పూర్తి చేసిన 60 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, యువత ఉద్యోగాలకు ఎదురుచూడకుండా స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తోన్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందన్నారు. శిక్షణ ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెరిగి, చిన్న స్థాయి వ్యాపారాలు ప్రారంభించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కల్పించడం ద్వారానే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న నిరుద్యోగ యువకులు, యువతులకు ఎమ్మెల్యే స్వయంగా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ సెటీ అధికారులు, యూనియన్ బ్యాంకు అధికారులు,శిక్షకులు, శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు, చట్టానికి పీఎల్‌వీలే వారధులు


**నవతరం -శ్రీకాకుళం**

సామాన్య ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి, వారికి న్యాయ సహాయం అందేలా చేయడంలో పారా లీగల్ వాలంటీర్లు (పీఎల్‌వీ) వారధిలా పనిచేయాలని మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి సి.హెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో మూడు రోజుల పాటు జరిగిన పీఎల్‌వీల అడ్వాన్స్‌డ్ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు.
శిక్షణలో భాగంగా మోటారు వాహనాల చట్టం, విద్యా హక్కు, పోక్సో, పర్యావరణ సమస్యలతో పాటు లైంగిక కార్మికులు, దివ్యాంగులు మరియు హెచ్ఐవీ బాధితుల హక్కులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.
విపత్తుల సమయంలో న్యాయ సేవా సంస్థల ద్వారా బాధితులకు అందే సేవల గురించి వివరించారు. ఈ చట్టాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని వాలంటీర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, ఎంవీఐ గంగాధర్, ప్యానల్ న్యాయవాది అన్నేపు భువనేశ్వర రావు, ఇన్ స్పెక్టర్ నారాయణి, విద్యా ఫౌండేషన్ ప్రతినిధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా మంజూరైన 67 మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ

**ఎమ్మెల్యే కూన రవికుమార్**

**నవతరం -ఆమదాలవలస**



వైసిపి ప్రభుత్వ కాలంలో అర్హత కలిగి ఉన్నప్పటికీ తెదేపా మద్దతు దారులు అనే కారణంతో కలివరం పంచాయతీకి చెందిన 20 మందికి పెన్షన్లు నిలిపివేశారు ఇప్పుడు ఆ నిలిపివేసిన పెన్షన్లను తిరిగి మంజూరు చేపించి ఆ పేద కుటుంబాలకు అందజేసిన ఎమ్మెల్యే రవికుమార్ గారు..
ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కొత్తగా మంజూరైన 67 స్పౌస్ మరియు రోల్‌బ్యాక్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమదాలవలస గౌరవ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారు హాజరై లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ గారు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఆధారంలేని కుటుంబాలకు పెన్షన్‌లు ఎంతో ఆర్థిక భరోసా కల్పిస్తాయని అన్నారు. కొత్తగా మంజూరైన 67 స్పౌస్ మరియు రోల్‌బ్యాక్ పెన్షన్లు లబ్ధిదారులకు అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.
ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పెన్షన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో ఎంపిడిఓలు, మున్సిపల్ అధికారులు,ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ నరసన్నపేటే ధ్యేయం

**నవతరం - నరసన్నపేట**

జిల్లాలో ప్రముఖ వాణిజ్య కేంద్రమైన నరసన్నపేటను ఆదర్శవంతమైన 'స్వచ్ఛ నరసన్నపేట'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయమే నరసన్నపేట చేరుకున్న కలెక్టర్, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించారు. పారిశుధ్య నిర్వహణలో రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి లక్ష్యాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సమయం ఆసన్నమైన తరుణంలో, నరసన్నపేటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పట్టణంలోని 20 వార్డులకు గానూ ప్రత్యేకంగా ఇన్చార్జ్ అధికారులను నియమించారు. వీరిలో 20 మంది ఎంపీడీఓలు, 20 మంది డిప్యూటీ ఎంపీడీఓలు, 50 మంది పంచాయతీ కార్యదర్శులు, 10 మంది తహసీల్దార్లతో పాటు భారీగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనుల కోసం ప్రత్యేకంగా 20 మంది కార్మికులను, ట్రాక్టర్లను కేటాయించి పారిశుధ్య విప్లవానికి శ్రీకారం చుట్టారు.
కలెక్టర్ తన పర్యటనలో భాగంగా సత్యవరం కూడలి నుండి పెద్దపేట వరకు కాలినడకన వెళ్లి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్గమధ్యంలోని వ్యాపారులతో మాట్లాడుతూ.. షాపుల ముందు చెత్త వేయకూడదని, రోడ్లపైకి నిర్మాణ సామాగ్రి, ఇసుక రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరిస్తూనే, పట్టణ పరిశుభ్రతలో వ్యాపారులు భాగస్వాములు కావాలని కోరారు. మెయిన్ రోడ్డుపై ఎక్కడా చెత్త కనిపించకుండా చూడాల్సిన బాధ్యత ఆయా దుకాణదారులదేనని స్పష్టం చేశారు. అనంతరం పచూరి కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు.
ప్రస్తుతం చేపట్టిన ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, తద్వారా నరసన్నపేటను ఒక మోడల్ పట్టణంగా నిలబెట్టాలని అధికారులను ఆదేశించారు.

# కవ్వించే నా కలలరాణి...?

రావే రావే...
నా మనసు వీణవై...
మౌనాన్ని మురిపించే
మధురిమవై...
నింగిలో నీలి మేఘాల
నెచ్చెలివై...
కడలిలో కెరటాల కదలికవై...
చీకటిలో చిరుదీపం చిమ్మే
చైతన్యమై...!

రావే రావే..
నా ప్రాణ దీపమై...
హరివిల్లు హొయల హారమై...
విరిజల్లు విరిసే విన్యాసమై...
చిరుజల్లు చిందించే
చిలిపితనమై...
చిటపట చినుకుల్లో చిగురించే
చెలిమివై...
కొమ్మల్లోకూసే కోటిరాగాల
కోయిలమ్మవై.!



రావే రావే...
నా ప్రియ సఖివై...
మెరిసే మెరుపుల
మేఘమై...
ఉరిమే ఉరుముల
ఊపిరివై...
గుండెగవాక్షంలో
గుబాళించే
గీతమై..!

రావే రావే...
నా కలల రాణివై...
అజంతా శిల్పాల
శాశ్వత
సౌందర్యమై...
ఆణిముత్యాల
అపురూప
ఆభరణమై...
నా జీవిత జాబిలికి
జ్ఞాపకాల
జ్యోతివై..!

రావే రావే...
నా జాబిలి జ్యోతివై...
చంద్రిక చల్లదనపు చరణమై...
రాజా రవి వర్మ వర్ణచిత్ర వైభవమై ...
బాపు బొమ్మలో బంధించిన భామవై..!

రావే రావే...
నా ప్రేయసి పరిమళమై...
రసరాగ రంజిత రాగమాలికవై...
రంగురంగుల రెక్కల రామచిలుకవై...
మదిని మత్తెక్కించే మంజుల మోహినివై.!

రావే రావే...
నా ఊహల ఊర్వశివై...
గలగలా పారే సెలయేరువై...
జలజలా దూకే జలపాతమై ...
అలలపై ఆడే ఆనంద తరంగమై...!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# విజయ్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమైన 30 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు.. కానీ చివర్లో ట్విస్ట్..!

- విజయ్‌కి మద్దతిచ్చేందుకు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రెడీ
- బీజేపీతో పొత్తు కారణంగా వెనక్కి తగ్గిన పళనిస్వామి
- మతతత్వ శక్తులను కలుపుకోవద్దంటూ కాంగ్రెస్ షరతు

తమిళనాడులో అధికారాన్ని చేపట్టేందుకు విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మెజార్టీ లేకపోవడంతో.. ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే టీవీకే పార్టీకి కాంగ్రెస్ మద్దతు తెలపగా.. ఇంకొన్ని సీట్లు అవసరమైంది. ఈ నేపథ్యంలోనే అన్నాడీఎంకే పార్టీలోని 30 మంది ఎమ్మెల్యేలు.. విజయ్‌తో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉండటం ఆసక్తికరంగా మారింది. అయితే బీజేపీతో పొత్తులో ఉన్న అన్నాడీఎంకే.. దీనికి ఒప్పుకోకపోవడంతో.. మద్దతుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

విజయ్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమైన 30 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు(ఫోటోలు–ఝఖఝఝఎ ্వశ్రీబస్త్రబ)

తమిళనాడులో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ.. మెజారిటీ 118 సీట్లకు 10 మంది ఎమ్మెల్యే బలం కావాల్సి ఉండగా.. కాంగ్రెస్ పార్టీ తన ఐదుగురు ఎమ్మెల్యేలతో మద్దతు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసిన విజయ్.. తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. కాంగ్రెస్ మద్దతుతో తమకు 112 మంది ఎమ్మెల్యేల బలం ఉందని చెప్పినా.. మెజార్టీ నిరూపించుకోవాల్సిందేనని గవర్నర్ చెప్పడంతో.. రేపు జరగాల్సిన ప్రమాణ స్వీకార కార్యక్రమం.. జరుగుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో కీలక పరిణామం చోటు చేసుకుంది.

ఎన్డీఏ కూటమిలో కీలక పార్టీగా ఉన్న అన్నాడీఎంకేలోని 30 మంది ఎమ్మెల్యేలు.. విజయ్‌కు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ చీఫ్‌ను కోరుతున్నారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే పార్టీ నుంచి మొత్తం 47 మంది అభ్యర్థులు విజయం సాధించగా.. వారిలో 30 మంది.. విజయ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే బీజేపీతో పొత్తు దృష్ట్యా పార్టీ నాయకత్వం అందుకు ఒప్పుకోవడం లేదు. అన్నాడీఎంకే పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి.. మెజార్టీ ఎమ్మెల్యేల నిర్ణయానికి విముఖత చూపిస్తుండటంతో ఈ పొత్తు కుదరడం లేదు. పరిస్థితి ఏదైనప్పటికీ.. అన్నాడీఎంకే విజయ్ టీవీకే పార్టీకి మద్దతు ఇవ్వదని ఆ పార్టీ సీనియర్ నేత కేపీ మునుసామి తేల్చి చెప్పారు.

మరోవైపు.. తన ప్రభుత్వం, తమతో కలిసి వచ్చే



పార్టీలు లౌకికవాదంతో ఉండాలని ఇప్పటికే విజయ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే అన్నాడీఎంకే బీజేపీతో కూడిన ఎన్డీఏ కూటమిలో ఉండటంతో.. ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. మరోవైపు.. మతతత్వ శక్తులను కలుపుకోవద్దంటూ.. మద్దతు ఇచ్చే సమయంలోనే విజయ్‌కి కాంగ్రెస్ పార్టీ తేల్చి చెప్పిన నేపథ్యంలో ఈ ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. టీవీకే పార్టీకి ప్రస్తుతం 108 సీట్లు ఉండగా.. అందులో విజయ్ రెండు స్థానాల్లో గెలవడంతో ఒకదానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో విశ్వాస పరీక్ష సమయంలో స్పీకర్ సీటును లెక్కించలేం (కేవలం టై అయినప్పుడు మాత్రమే స్పీకర్ ఓటును వేస్తారు). దీంతో టీవీకేకు టెక్నికల్‌గా బలం 106 మాత్రమే. ఇక కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు ఉండటంతో.. ఇది 111గా మారింది. ఈ నేపథ్యంలోనే సీపీఐ, సీపీఎం వంటి లెఫ్ట్ పార్టీలతోపాటు.. ఐయూఎంఎల్, వీసీకే వంటి చిన్న పార్టీలకు కలిపి మరో ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరందరినీ కలిపితే మొత్తం సంఖ్య 117 కి చేరుతుంది.



# వీకెండ్ ముగిసింది.. ఫ్లాప్ హీరోయిన్ గా మిగిలింది

సాయి పల్లవి బాలీవుడ్ డెబ్యూ ఫ్లాప్ అయింది. హిందీ చిత్రసీమలో అడుగుపెట్టి ఆమె చేసిన ఏక్ దిన్ సినిమా డిజాస్టర్ అనిపించుకుంది. ఫస్ట్ వీకెండ్ ముగిసేనాటికి ఈ సినిమా ఇక కోలుకోదని తేలిపోయింది. అలా ఫ్లాప్ సినిమాతో బాలీవుడ్ లో అడుగుపెట్టినట్టయింది సాయిపల్లవి. కొడుకును హీరోగా పెట్టి, స్వయంగా అమీర్ ఖాన్ సహ-నిర్మాతగా వ్యవహరించి నిర్మించిన సినిమా ఇది. మూవీ ప్రమోషన్స్ ను కూడా అమీర్ దగ్గరుండి చూసుకున్నారు. ప్రివ్యూలో సినిమా క్లయిమాక్స్ చూసి అమీర్ కంటతడి పెట్టుకున్న దృశ్యాలు కూడా నిమిషాల్లో వైరల్ అయ్యాయి.

అయితే అమీర్ కన్నీళ్లు వృధా అయ్యాయి. ఆయన ఫీల్ అయినట్టు, ఆడియన్స్ ఫీల్ అవ్వలేకపోయారు. ఇక సాయిపల్లవి విషయానికొస్తే, ఎందుకో ఆమె లుక్, యాక్షన్ హిందీ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వలేదు. కీలకమైన మొదటి వారాంతం ముగిసింది. ఏక్ దిన్ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా కేవలం 3.65 కోట్ల గ్రాస్ వసూళ్లు మాత్రమే వచ్చాయి. ఆదివారం ఈ సినిమాకు ఆక్యుపెన్సీ పెరిగినప్పటికీ అది చాలదు. ఇక సాయిపల్లవికి గట్టి పట్టున్న సౌత్ మార్కెట్లో కూడా ఈ సినిమా మెరవలేకపోయింది. ఈ సినిమా తెలుగు వెర్షన్ (ఒక రోజు)కు కేవలం 28 లక్షల రూపాయల నెట్ వసూళ్లు మాత్రమే వచ్చాయి. అటు తమిళ వెర్షన్ కు కేవలం 13 లక్షల రూపాయలు వచ్చాయి.


అలా సాయిపల్లవి బాలీవుడ్ డెబ్యూ వృధా అయింది. ఇప్పుడామె చేతిలో మిగిలిన మరో హిందీ చిత్రం రామాయణ. రణబీర్ కపూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీత పాత్ర పోషిస్తోంది సాయిపల్లవి.

# మొన్న వెంకీ సినిమా.. ఇప్పుడు చిరు సినిమా?

రానురాను ఆఖరి నిమిషంలో మ్యూజిక్ డైరక్టర్లు మారడం కామన్ ప్రాక్టీస్ అయిపోతోంది. మొన్నటికిమొన్న వెంకటేశ్-త్రివిక్రమ్ సినిమాకు సంగీత దర్శకుడ్ని మార్చేశారు. అంతకంటే ముందు ఉస్తాద్ భగత్ సింగ్, పుష్ప-2 లాంటి సినిమాలకు సంగీత దర్శకుల్ని మార్చేశారు. ఇప్పుడు విశ్వంభర వంతు.

విశ్వంభర సినిమాకు సంగీత దర్శకుడ్ని మార్చినట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. చిరంజీవి హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు కీరవాణి సంగీత దర్శకుడు. ఇప్పటికే పాటలు కూడా కంపోజ్ చేశారాయన. షూటింగ్ కూడా పూర్తయింది. ఇప్పుడు రీ-రికార్డింగ్ కోసం గౌరహరిని తీసుకున్నట్టు తెలుస్తోంది. హనుమాన్, మిరాయి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న గౌరహరి, విశ్వంభర సినిమాకు రీ-రికార్డింగ్ వర్క్ చేస్తున్నాడంట. దీనిపై యూవీ క్రియేషన్స్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. ఇప్పటికే చాలా ఆలస్యమైంది విశ్వంభర సినిమా.

అటు వారణాసి వర్క్ రోజురోజుకు పెరిగిపోతోంది. ఇలాంటి టైమ్ లో రెండు సినిమాలకు టైమ్ కేటాయించలేకపోతున్నారట కీరవాణి. విశ్వంభర నుంచి మిడిల్ డ్రాప్ అవ్వడానికి ఇదే రీజన్ అని చెబుతున్నారు. మరోవైపు ఇప్పటివరకు విశ్వంభర సినిమాకు రీ-రికార్డింగ్ చేయకుండా ఏం చేస్తున్నారనే చర్చ కూడా సోషల్ మీడియాలో మొదలైంది. ఎప్పుడో ప్రారంభమైన ఈ సినిమాకు గ్రాఫిక్స్ మాత్రమే పెండింగ్ ఉందని చాలామంది అనుకుంటుండగా, ఇప్పుడు రీ-రికార్డింగ్ వర్క్ కూడా బ్యాలెన్స్ అంటూ ప్రచారం నడుస్తోంది.



# పోస్ట్ డాక్టరోల్ పట్టా పొందిన ఐటమ్ అధ్యాపకులు డాక్టర్ రమేష్



**నవతరం టెక్కలి**

ఐతం అధ్యాపలు డాక్టర్ వై రమేష్ అంతర్జాతీయ స్థాయి పోస్ట్ డాక్టరల్ పట్టా పొందారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు తెలిపారు. టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సిఎస్ఇ విభాగాదిపతి , డాక్టర్ వై రమేష్ అంతర్జాతీయ స్థాయి పేరొందిన సింగపూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిట్ )విశ్వావిద్యాలయ నుండి" బిల్డింగ్ ట్రాన్సపరెంట్ అండ్ ఎక్సప్లయినబుల్ ఎ ఐ మోడల్స్ ఫర్ స్మాల్ హోల్డర్స్ ఫర్ అగ్రికల్చరల్." అనే ఆధునిక అంశంపై ఆయన చేసిన పరిశోధన పూర్తి చేసి పోస్ట్ డాక్టరోల్ పట్టా పొంది నట్లు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు వివరణ తెలిపారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, డా రమేష్ సాధించిన ఈ పరిశోధనాత్మక విజయం కళాశాల ప్రతిష్టను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచిందని అన్నారు. ఇలాంటి ఉన్నత స్థాయి పరిశోధనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, పరిశోధనాభిరుచిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, డీన్లు, హెచ్ఓడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొని అభినందించారు.

# చరిత్ర తిరగరాసిన విజయ్

## - టీవీ కే విజయం అద్భుతం
## - డాక్టర్ ఉలాల కోదండ రామ్



**నవతరం-ఇచ్ఛాపురం**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టి వికే విజయం అద్భుతమని, తమిళనాడు యువతకు హీరో.. పేద ప్రజల ఆరాధ్య దైవం విజయ్ విజయం వెనుక విశేష కృషి ఉందని ప్రముఖ సంఘ సేవకులు, మహాలక్ష్మి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఉలాల కోదండ రామ్ అన్నారు.

బుధవారం ఆయన ఇచ్ఛాపురంలో మాట్లాడుతూ, ఒక హీరోగా యువత గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఎన్నికల్లో పోటీ చేసిన మొదటి సారే అద్భుతమైన ఆరంభాన్ని అందుకున్నారన్నారు. జగనన్న చిత్రపటంతో ఎన్నికల బరిలో దిగి తమిళ ప్రజల ఓట్లను గెలుచుకున్నారన్నారు.

జగనన్న బాటలో నడిచి ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయవలసిన బాధ్యత కొత్త ప్రభుత్వం పై ఉందన్నారు.

మొదటినుంచి కూడా విజయ్ స్నేహపూర్వకంగా జగనన్న తో మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారని, ఒక హీరో స్థాయిలో ఉంటున్న విజయ్ ఎక్కడా ఎటువంటి గర్వం లేకుండా జగన్మోహన్ రెడ్డి చిత్రపటాన్ని పెట్టుకొని ఎన్నికల ప్రచారంలో ఓట్లు అడగడం విజయ్ హుందాతనానికి నిదర్శనం అన్నారు.

తమిళనాడు ప్రజలు మార్పు కోరుతూ ఓటు వేశారని ఆయన తెలిపారు. తమిళనాడుకు నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న విజయ్ కి అభినందనలు తెలుపుతున్నామన్నారు. స్థిరమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజలకు మంచి పరిపాలన అందించడమే కాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, అలాగే తమిళనాడు రాష్ట్ర అభివృద్ధికి సంపూర్ణంగా కృషి చేయాలని డాక్టర్ కోదండ రామ్ ఆకాంక్షించారు.

# ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక చేయూత

## రూ.4.03 లక్షల చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ కేవీ.మహేశ్వర్‌రెడ్డి



**నవతరం-శ్రీకాకుళం**

జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా విశేష సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పెద్దింటి శంకరరావుకు ఆర్థిక సహాయంగా రూ. 4.03 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ కేవీ. మహేశ్వర్‌రెడ్డి బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు.

జిల్లాలో విధులు నిర్వహిస్తోన్న హోంగార్డు సిబ్బంది అంతా స్వచ్ఛందంగా తమ ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును విరాళంగా సమకూర్చడం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించారు. ఉద్యోగ విరమణ చేసిన, విధి నిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇటువంటి సంక్షేమ కార్యక్రమం చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శంకరరావు పోలీసు శాఖలో అంకితభావం, నిబద్ధతతో సేవలందించారని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. హోంగార్డు సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఒకరోజు డ్యూటీ అలవెన్సును అందించడం అభినందనీయమని, ఇటువంటి చర్యలు పోలీసు కుటుంబాల్లో ఐకమత్యాన్ని పెంపొందించడమే కాకుండా, అవసర సమయంలో పరస్పరం అండగానుండే భావనను బలపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




రాము ప్రతి ఆదివారం లాగే మార్కెట్‌కి వెళ్లాడు. రంగురంగుల పండ్లు చూసి అతనికి చాలా ఆనందం కలిగింది. ప్రత్యేకంగా మామిడి పండ్లు--–బంగారం లాగా మెరుస్తూ కనిపించాయి. "ఇవి చాలా బాగున్నాయి!" అని అనుకుని రెండు కిలోలు కొనేశాడు. ఇంటికి వెళ్లి కుటుంబంతో కలిసి తినాలని ఉత్సాహంగా వచ్చాడు.ఇంటికి వచ్చాక రాము భార్య లక్ష్మి పండ్లు చూసి కాస్త సందేహపడింది. "ఇంత త్వరగా మామిడి సీజన్‌లో ఇలా పూర్తిగా పసుపు రంగులో ఎలా వచ్చాయి?" అని అడిగింది. కానీ రాము నవ్వుతూ "ఇప్పుడంతా ఫాస్ట్ కాలం... అన్నీ త్వరగా వస్తాయి!" అన్నాడు.ఆ రోజు సాయంత్రం కుటుంబం మొత్తం ఆ పండ్లు తిన్నారు. మొదట రుచి బాగానే అనిపించింది. కానీ రాత్రి అయ్యేసరికి చిన్న కుమారుడు రాజు కడుపు నొప్పితో ఏడవడం మొదలుపెట్టాడు. లక్ష్మికి కూడా తలనొప్పి వచ్చింది. రాము కూడా అసౌకర్యంగా ఫీల్ అయ్యాడు. వెంటనే వాళ్లు డాక్టర్ దగ్గరకు వెళ్లారు.డాక్టర్ వాళ్లను చూసి అడిగాడు: "ఈరోజు మీరు బయట నుంచి ఏమైనా కొత్తగా తిన్నారా?" రాము మామిడి పండ్ల గురించి చెప్పాడు. డాక్టర్ కొద్దిసేపు ఆలోచించి, "చాలా సార్లు మార్కెట్‌లో పండ్లు సహజంగా పండవు. కొందరు వ్యాపారులు వాటిని త్వరగా అమ్మడానికి క్యాల్షియం కార్బయిడ్ వంటి ప్రమాదకర రసాయనాలు వాడుతారు. ఇవి ఆరోగ్యానికి హానికరం. సహజంగా పండే ప్రక్రియను అనుకరించడానికి ఇథిలీన్ వాయువు కూడా వాడతారు, కానీ అది సరైన విధంగా వాడకపోతే సమస్యలు వస్తాయి" అని వివరించాడు.రాము ఆశ్చర్యపోయాడు. "పండ్లు కూడా ఇలా ప్రమాదకరంగా ఉంటాయా?" అని అడిగాడు. డాక్టర్ నవ్వుతూ, "అందుకే జాగ్రత్తగా కొనాలి. బయట చాలా అందంగా, ఒకే రంగులో ఉన్న పండ్లు ఉంటే కొంచెం అనుమానం పెట్టుకోవాలి" అని చెప్పాడు.ఆ రోజు తర్వాత రాము తన అలవాట్లు మార్చుకున్నాడు. మార్కెట్‌లో పండ్లు కొనేప్పుడు: వాసన చూసేవాడు సహజంగా రంగులు ఉన్నాయా అని గమనించేవాడు ఇంటికి వచ్చాక ఉప్పు నీటిలో నానబెట్టేవాడుకొద్దికాలంలో అతని కుటుంబం ఆరోగ్యంగా మారింది. రాము తన పొరుగువారికి కూడా ఈ విషయం చెప్పడం ప్రారంభించాడు.ఒక రోజు అతను తన పిల్లలకు చెప్పాడు:"బంగారం లాగా మెరుస్తున్న ప్రతి పండు మంచిదే అనుకోవద్దు. సహజంగా వచ్చినదే నిజమైన ఆరోగ్యం ఇస్తుంది."నీతి:బయట కనిపించే అందం కంటే లోపల ఉన్న నాణ్యత ముఖ్యం. మన ఆరోగ్యం కోసం జాగ్రత్తగా ఎంపిక చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది.

**కలంతో మార్పు: తేరాల రాజేంద్రప్రసాద్ గుప్తా.. బాబు జగ్జీవన్ రామ్ నగర్, హైదరాబాద్ 37**

## - జోన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్. సింగూరు
## - ఖ్యాతి వృద్ధాశ్రమంలో జేసీఐ దాన్ కార్యక్రమం

# చిన్ననాటి నుండే సామాజిక బాధ్యతలను తెలియజేయాలి




**నవతరం-శ్రీకాకుళం**

చిన్ననాటి నుండే సామాజిక బాధ్యతలను, తల్లితండ్రులు తెలియజేయాలని, జేసీఐ సన్ రైజర్స్ పూర్వపు అధ్యక్షులు, జోన్ డైరెక్టర్ జెఎఫ్ఎం ప్రవీణ్ కుమార్ సింగూరు అన్నారు. నగరానికి చెందిన అల్లంశెట్టి.సతీష్ కుమార్, అనూషాల గారాలపాటతో తన్విత జన్మదినం సందర్భంగా, స్థానిక బొందలిపురంలో గల ఖ్యాతి వృద్ధాశ్రమంలో అన్నప్రసాద వితరణ మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ సింగూరు, జేసిఐ శ్రీకాకుళం సన్రైజర్స్ కార్యదర్శి వెంకటేష్ ఐథమ్, పవన్ లు బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చిన్నారులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని, భవిష్యత్ లో సమాజానికి వెన్నుముకగా నిలుస్తూ, ఆపదలో ఉండేవారికి ఏదో ఒక రూపంలో సహాయపడతారని తెలిపారు. అలాగే ప్రతి నెలా, జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ ఆధ్వర్యంలో దాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మా సభ్యులలో ప్రతీ వేడుకను, దాన్ కార్యక్రమంలో భాగం చేస్తున్నామన్నారు. అనంతరం వృద్ధులు, నేటి అన్నదాత చిన్నారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షురాలు షర్మిల సభ్యుల బృందం, ఖ్యాతి వృద్ధాశ్రమం నిర్వాహకులు, వృద్దులు పాల్గొన్నారు.

# రూ.22 వేలతో రూ.40 లక్షల రిటర్న్స్..

## - నిర్మలా సీతారామన్ కొత్త స్కీమ్ తెచ్చారా?
## - క్లారిటీ ఇచ్చిన కేంద్రం!



కేవలం రూ.22 వేలు పెడితే ఏకంగా రూ.40 లక్షల రిటర్న్స్ వస్తాయని, ఇందుకోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్తగా క్వాంటమ్ ఏఐ అనే స్కీమ్ తీసుకొచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. నిర్మలా సీతారామన్ ఫోటో ఉండడంతో చాలా మంది ఈ కొత్త స్కీమ్ గురించి వెతుకుతున్నారు. అయితే, అందులో ఎలాంటి నిజం లేదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తేల్చింది. క్వాంటమ్ ఏఐ స్కామ్ నమ్మి మోసపోవద్దని తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మద్దతు గల క్వాంటమ్ ఏఐ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా హైరిటర్న్స్ పొందుతారని పేర్కొంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ క్వాంటమ్ ఏఐ పథకంలో కేవలం రూ.22 వేలు పెడితే ఏకంగా రూ.40 లక్షల రిటర్న్స్ వస్తాయని, ఎలాంటి రిస్క్ లేకుండా ప్రభుత్వ గ్యారంటీ ఉంటుందని నిర్మలా సీతారామన్ చెప్పినట్లు ఈ పోస్టులో పేర్కొన్నారు. దీంతో ఇది నిజమైనదేనని నమ్మేలా అనిపిస్తోంది.

నిజంగానే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ క్వాంటమ్ ఏఐ అనే కొత్త పథకాన్ని ప్రారంభించారా? అంటే అందులో అసలు నిజం లేదని తేల్చేసింది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పీఐబీ ఫ్యాక్ట్ చెక్. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చింది.

'యూనియన్ ఫైనాన్స్ మినిస్టర్ పేరుతో క్వాంటమ్ ఏఐ పెట్టుబడి పథకం ప్రారంభించారని సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. ఎలాంటి రిస్క్ లేకుండా, 100 శాతం ప్రభుత్వ గ్యారెంటీతో రూ.22 వేల పెట్టుబడితో రూ.40 లక్షలు రిటర్న్స్ వస్తాయని చెప్పడం అనేది పూర్తిగా ఫేక్' అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ పేర్కొంది. ఆర్థిక మంత్రి సోషల్ మీడియా వేదికగా హామీ ఇవ్వడం అనేది ఆకర్షణీయంగా ఉండవచ్చు, కానీ, ఆ ఫోస్ట్ తప్పుడు అని తెలిపింది. ఆర్థిక మంత్రి అలాంటి పెట్టుబడి పథకాలపై ఎప్పుడూ మాట్లాడలేదని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం గానీ, ఆర్థిక మంత్రి మద్దతు గానీ ఉన్న అలాంటి పెట్టుబడి పథకం ఏదీ లేదని తెలిపింది.

ప్రజలు ఇలాంటి నకిలీ పోస్టులను నమ్మి తమ కష్టార్జితాన్ని నష్టపోద్దని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ కోరింది. అలాంటివి కనిపించినప్పుడు అధికారిక మూలాల ద్వారా నిజాలను తెలుసుకోవాలని వెల్లడించింది. అలాంటి తప్పుదోవ పట్టించే భారత ప్రభుత్వానికి సంబంధించిన పోస్టులు, సమాచారం కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరింది. వాట్సాప్ ద్వారా అయితే 8799711259 లేదా ఈ-మెయిల్ ద్వారా అయితే factcheck@pib.gov.inకు సమాచారం ఇవ్వాలని తెలిపింది.

సోషల్ మీడియాలో ఇలా వైరల్ అయ్యే వాదనలు ఒక సుపరిచితమైన పద్ధతిని అనుసరిస్తాయి. ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలలో తరచుగా కనిపించే ఈ పద్ధతిలో త్వరగా నమ్మకాన్ని పొందడానికి ఒక ప్రముఖ వ్యక్తి గొంతు, చిత్రం లేదా వీడియోను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలి. అధికారిక సోర్స్ నుంచే సమాచారం తెలుసుకుని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. చిన్న మొత్తాలతో తక్కువ సమయంలోనే హైరిటర్న్స్ అనేది సాధ్యం కాదని చెప్పవచ్చు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**